క్లుప్తంగా

రేపు మెగా రక్తదాన శిబిరం

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని కర్పల్ గ్రామంలో ఈ నెల 22న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ రాయికోడ్ మండల ప్రధాన కార్యదర్శి మైపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తలసేమియాతో బాధపడే చిన్నారులు ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో తమ తండ్రి దత్తురెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మానవతా దృక్పథంతో యువకులు శిబిరానికి అధికసంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని కోరారు.

న్యాయసేవ సలహా కేంద్రం ప్రారంభం



న్యాయ సలహా కేంద్రంలో న్యాయవాది గౌతమి, ప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారంలో ఉచిత న్యాయ సేవ సలహా కేంద్రాన్ని ప్రముఖ న్యాయవాది గౌతమి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి చట్టపరమైన సందేహాలు ఉన్నా న్యాయ సేవ సలహా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం ప్రతినిధి శారద పాల్గొన్నారు.

ఈ-పాస్ స్టాక్ పరిశీలన



పెద్దచల్మెడలో స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం సరఫరా చేసిన వివిధ రకాల మందు సంచుల ఈ-పాస్ (ఆన్‌లైన్) స్టాక్‌ను జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింగ్‌రావు శనివారం పరిశీలించారు. మండల పరిధిలోని బుదేరా సంగమేశ్వర, పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో స్టాక్ ఎంత ఉంది.. తదితర వివరాలను సేకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివకుమార్, షాపు నిర్వాహకులు సిద్దయ్య పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు కేవీపీఎస్ కృషి



విరాళం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: కుల నిర్మూలనకు కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) కేవీపీఎస్ కృషి చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం అన్నారు. ప్రజా ఉద్యమాల బలోపేతం చేసేందుకు కార్మికుల నుంచి సేకరించిన రూ.70వేలను సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా బాధ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. సామాజిక న్యాయం, మతసామరస్యం, ఆర్థిక సమానత్వం, కుల నిర్మూలన వంటి లక్ష్యాల సాధనకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలను బలపరుస్తున్న కార్మిక వర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు రాజయ్య యాదగిరి, ప్రవీణ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్, దౌలాపూర్, నాగులదేవులపల్లి, చికుమద్దూర్, హత్నూర, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం జయశ్రీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం ఎప్పటికప్పుడు లారీలలో రైస్‌మిల్‌కు తరలించాలన్నారు. వర్షాలు వచ్చే సూచనలు ఉండటంతో ధాన్యంపై టార్పాలిన్ కవర్లను కప్పి ఉంచాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్, సీసీలు కల్పన, మహేష్, పద్మవేణి, ఆయా గ్రామాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హత్నూరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- దుర్గంధం వెదజల్లుతున్న పరిసరాలు
- దోమల బెడదతో జనం బెంబేలు
- రోగాల పాలవుతున్న ప్రజలు
- కన్నెత్తి చూడని మున్సిపల్ అధికారులు

జహీరాబాద్ పట్టణంలో రోజురోజుకు పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరంతా రోడ్లపై ఏరులై పారుతుండటంతో దోమలు, ఈగలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడమే. ఇళ్ల మధ్యన ఉన్న ఖాళీ స్థలాల్లోని మురుగుకుంటలు, ముళ్ల పొదలు ఉండటంతో పందులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని పట్టణ ప్రజలు వాపోతున్నారు. – జహీరాబాద్ టౌన్



పస్తాపూర్‌లోని మహీంద్ర కాలనీ రోడ్డుపై నిలిచిన మురుగునీరు

జిల్లాలోనే అతి పెద్దయిన జహీరాబాద్ మున్సిపాలిటీ రోజురోజుకు విస్తీర్ణం పెరుగుతోంది. పట్టణానికి సమీపంలో ఉన్న రంజోల్, పస్తాపూర్,అల్లీపూర్, చిన్న హైదరాబాద్‌తో పాటు హోతి(కె) గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో 24 వార్డులున్న మున్సిపల్ విస్తీర్ణం 37 వార్డులకు పెంచారు. పట్టణ జనాభా లక్ష దాటింది. మున్సిపల్ పరిధి పెరిగినా సమస్యలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి.

వేధిస్తున్న ప్రధాన సమస్యలు

రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టు, తాగునీరు, కరెంట్ ముఖ్యంగా పారిశుధ్య సమస్యలు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయి. విలీన గ్రామ పంచాయతీల్లో పరిస్థితి ఇంకా అధ్వానంగా తయారైంది. పట్టణంలోని ఖాళీ స్థలాలు పందులకు ఆవాసాలుగా మారాయి. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో పట్టణవాసులు రోగాల భారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు.



మాణిక్‌ప్రభు వీధికి వెళ్లేదారిలో కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఫాగింగ్ చర్యలు శూన్యం

దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టడం లేదు. పారిశుధ్య పనులను చేపట్టకపోవడంతో క్యూలెక్స్ దోమలు వృద్ధి చెందుతున్నాయి. పట్టణంలోని మాణిక్‌ప్రభు, గడి తదితర ప్రాంతాలతో పాటు విలీన గ్రామాలైన హోతి(కె), రంజోల్, పస్తాపూర్, అల్లీపూర్, చిన్నహైదరాబాద్ గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి.

ప్రత్యేక దృష్టి సారించాం



పారిశుధ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రతిరోజు పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. మున్సిపల్ కార్మికులు మురుగు కాలువలను శుభ్రం చేయడం, చెత్త తొలగించడం వంటి పనులు చేపడుతున్నారు. ఖాళీ స్థలాల వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్న మాట వాస్తవమే.. యజమానులు ప్లాట్లను శుభ్రం చేసుకోవాలి. లేదంటే వాటిని గుర్తించి నోటీసులు అందజేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, జహీరాబాద్

మాణిక్‌ప్రభు వీధి ప్రాంతంలో మురుగుకాలువలను శుభ్రం చేయని కారణంగా మురుగంతా రోడ్డుపై నుంచి పారుతోంది. పారిశుధ్య నిర్వాహణ కోసం ప్రత్యేంగా నిధులు కేటాయించకుండా సాధారణ నిధుల నుంచే ఖర్చు చేసి పనులు చేపడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాం

- ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల హామీ
- 10 ఏళ్లలో బీజేపీ చేసిందేమీ లేదు
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గత ప్రభుత్వం హయాంలో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో శనివారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ డివిజన్, మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేండ్ల కాలంలో రూ.9000వేల కోట్లతో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి ప్రతీకగా నిలిపామని వివరించారు. అభివృద్ధిలో పక్షపాతం లేకుండా పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించి మెరుగైన పాలన అందించామని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం ఆరు గ్యారంటీల ప్రవేశపెట్టి అమలు చేయడంలేదన్నారు. 10 ఏళ్లలో బీజేపీ చేసిందేమీలేదని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ విజయాన్ని ఆపలేరన్నారు. ఈ నెల 22న పటాన్‌చెరులో నిర్వహించనున్న పటాన్‌చెరు డివిజన్, మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ కుమార్, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సపానదేవ్, మాజీ ఎంపీపీలు యాదగిరియాదవ్, శ్రీశైలంయాదవ్, పార్టీ మండల అధ్యక్షులు పాండు, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కుమార్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వివాహిత అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: కిరాణాషాప్‌నకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణ తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని సాయికాలనీకి చెందిన లక్ష్మిదివ్య శుక్రవారం రాత్రి కిరాణాషాప్‌నకు వెళ్లి వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు లక్ష్మిదివ్య కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య అదృశ్యంపై భర్త నాగరాజు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాలీసెట్ దరఖాస్తుకు గడువు పెంపు

సంగారెడ్డి టౌన్: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు పాలీసెట్ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ వరకు గడువును పొడగించిందని సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మే 24వ తేదీన అర్హత పరీక్షను నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష దరఖాస్తుకు ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులకు రూ.250, ఇతరులకు 500 చెల్లించాలని సూచించారు.

వృద్ధురాలు అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వృద్ధురాలు అదృశమైన సంఘటన రామచంద్రాపురం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని కాకతీయనగర్‌లో నివాసం ఉండే వృద్ధురాలు పద్మావతి శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పద్మావతి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఆర్డీఓ పాండు

జోగిపేట(అందోల్): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని, అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారని జోగిపేట ఆర్డీఓ పాండు విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి ఆయన హాజరై ప్రసంగించారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యతోనే గుర్తింపు వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్ కుమార్, అందోల్ జోగిపేట్ మున్సిపాలిటీ కమిషనర్ తిరుపతి, కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ అడవి రాజు, అకాడమీ కోఆర్డినేటర్ గోపాల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ పాండు

సంక్షిప్త వార్తలు

బీజేపీలో చేరికలు



జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జెడ్పీటీసీ అరుణవిజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగ్నునాథ్, వీరారెడ్డి, రమేష్, నరేష్ గుప్తా రాజిరెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ధర్నా

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పెద్ద చెరువులో నీట మునిగిన ప్లాట్లను ఇప్పించాలని బాధితులు శనివారం అమీన్‌పూర్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌నకు వినతిపత్రం అందజేశారు. అమీన్‌పూర్ పట్టణంలోని పెద్ద చెరువు పరిధిలో అయిదు వేల ప్లాట్లు చెరువునీటిలో మునిగిపోయాయని బాధిత సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, బ్రహ్మానందరావు తెలిపారు. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాట్లు విక్రయించింది హుడా సంస్థేనని, ఇప్పుడేమో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి 465 ఎకరాలంటూ అధికారులు చెబుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

మునిపల్లి(అందోల్): జహీరాబాద్ పార్లమెంటు అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు ఉపెందర్ ఆధ్వర్యంలో బొడపల్లి, అల్లాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు కృష్ణ, రాజిరెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

'విమర్శలు మాని అభివృద్ధికి సహకరించండి'



జహీరాబాద్: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌పై విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేశాట్టి పాటిల్ అన్నారు. జహీరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ బీబీ పాటిల్‌ను లక్ష్యంగా చేసుకుని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు విమర్శలకు దిగడం సరైంది కాదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మదన్‌మోహన్‌రావు బీబీ పాటిల్‌పై ఓటమి పాలు కావడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు కేసు పెట్టాడని విమర్శించారు. కేసును కోర్టు సైతం కొట్టేసిందని గుర్తు చేశారు.

మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్

జహీరాబాద్ టౌన్: మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్ అని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని ఇస్లామిక్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, ఉపాధ్యాయుల సంఘం ,దళిత సంఘాలు, జమాతే ఇస్లామిక్ హింద్ నాయకులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

పటాన్‌చెరుటౌన్: చేపలు పట్టేందుకు వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. ఒరిస్సాకు చెందిన జాగరి మోజీ(25) బతుకుదెరువు కోసం రెండు నెలల కిందట పటాన్‌చెరు మండలం ఇంద్రేశం వచ్చి ఇటుక బట్టీల వద్ద పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి స్థానికంగా ఉండే నవీన్ తో కలిసి ఇంద్రేశం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. వెంటవెళ్లిన నవీన్ స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హోర్డింగ్‌లపై ఆరా

సాక్షి ఎఫెక్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్ల పక్కన ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లపై ఈ నెల 17న సాక్షి దినపత్రికలో 'బాబోయ్.. హోర్డింగులు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ విషయంపై ఆర్‌డీఎంఏ శ్రీనివాస్‌రెడ్డి ఆరా తీశారు. ఎన్ని హోర్డింగ్‌లకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసిన హోర్డింగ్‌లను ఎప్పటివరకు తొలగిస్తారు.. అనే విషయాలపై ఆరా తీశారు. ఆర్‌డీఎంఏ ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చిన హోర్డింగ్‌లను త్వరలోనే తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి వివరణ ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు ఖమ్రోద్దీన్ అన్నారు. మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో బడీడు, బడికిరాని పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఖమ్రోద్దీన్ మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామంలో ఉన్న పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ఉండేందు కోసం ముందస్తుగానే వివరాలు నమోదు చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత భోజనంతో పాటు బుక్స్, రెండు జతల దుస్తులను ప్రభుత్వం అందజేస్తోందని, ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, గోపాల్, ప్రీతి, పీటీఎస్ యాదయ్య పాల్గొన్నారు.



వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఝరాసంగం: కంబాలపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను ఎంపీడీవో సుధాకర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పిస్తామన్నారు. నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కూలీలు తమ పూర్తి పని దినాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ రాజ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



కొండాపూర్: మాచేపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

పనులను సద్వినియోగం చేసుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని మాచేపల్లి, తొగర్‌పల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధిపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి కాలం అయినందునా కూలీలు త్వరగా పనులు పూర్తిచేసుకోవాలని సూచించారు. ఏపీఓ వీరప్ప, తొగర్‌పల్లి పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

జహీరాబాద్ టౌన్: అగ్నిమాపక శాఖ వారోత్సవాల (ఫైర్ సర్వీసెస్ వీక్) ముగింపు కార్యక్రమాన్ని పట్టణంలోని ఓ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి పడకుండా, నివారణకు ఎలా వ్యవహరించాలి, అందుబాటులో ఉన్న పరికరాలను ఎలా వినియోగించాలో ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఫైర్‌మెన్‌లు సిద్దయ్య, శ్రీధర్, రఫియోద్దీన్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

నియామకం



ఉదయ్‌కుమార్

జిన్నారం(పటాన్‌చెరు): బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా గుమ్మడిదల గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఉదయ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

జోగిపేట(అందోల్): అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్‌కుమార్, 16వ వార్డు కౌన్సిలర్ పడిగే సుమిత్ర, జోగిపట చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు పడిగె సత్యంతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి దామోదర రాజనర్సింహ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, శివశంకర్, సురేష్, నాగరాజు, దుర్గేష్, చందర్, హరికష్ణగౌడ్, కోఆప్షన్ సభ్యులు శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మాజీ వార్డుమెంబర్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు హన్మండ్లు, శ్రీధర్, కృష్ణ, రాజశేఖర్, వినయ్‌గౌడ్, మల్లేశం, పాల్గొన్నారు.

నారాయణఖేడ్ మండల పరిధిలో..

నారాయణఖేడ్: బీఆర్‌ఎస్ నుంచి భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు నారాయణఖేడ్‌లో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘ మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్‌ల సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా శేరితండాకు చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ సంకీబాయి, ఉపసర్పంచ్ మోతీరాంతో పాటు 8మంది వార్డుసభ్యులు, పెద్దశంకరంపేట మండల బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం, పట్టణశాఖ అధ్యక్షుడు మహ్మద్‌యాదుల్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి శ్రీనివాస్, నగేష్ శెట్కార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



జోగిపేట: కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ

రాయికోడ్ మండల పరిధిలో...

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా సింగితం గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, నల్లంపల్లి గ్రామానికి చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దప్పపాటిల్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌శెట్కార్, ఎంపీపీ మొగులప్ప, సీనియర్ నాయకులు సుభాష్‌పాటిల్ పాల్గొన్నారు.